క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



జనగామ: కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మాజీ జిల్లా అధ్యక్షుడు కేవీఎల్ఎన్ రెడ్డి, ముఖ్య నాయకులు ఉన్నారు.

'రెడ్‌క్రాస్' భవనానికి నిధులు మంజూరు చేయాలి..

జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు మహంకాళి హరిచ్చంద్రగుప్త కోరారు. ఈ మేరకు గురువారం గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు వినతిపత్రం అందజేశారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తిరస్కరించాలి

దేశంలో ముస్లింల ఆందోళనల నేపథ్యంలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును తిరస్కరించాలని జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ.మసిఉర్ రెహమాన్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. చట్ట ప్రకారం వక్ఫ్ ఆస్తులు ఎప్పటికీ ఆస్తిగానే ఉంటాయని, బోర్డులను రద్దు చేసి చట్టాలను సవరించి భూములను తమ అధీనంలోకి తీసుకోవాలని కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు.

వైభవంగా బోనాలు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామస్తులు గురువారం వైభవంగా బోనాలు చేశారు. శ్రావణమాస చివరి గురువారం కావడంతో ఆలయాలకు మహిళలు బోనాలు తీసుకెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

కవిత బెయిల్‌తో బీజేపీకి సంబంధమేంటి?

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



లింగాలఘణపురం: ఎమ్మెల్సీ కవితకు కోర్టులో బెయిల్ వస్తే బీజేపీకి సంబంధమేంటని, దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను గౌరవించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సీఎం రేవంత్‌రెడ్డి తీరును విమర్శించారు. గురువారం మండలంలోని కిష్టగూడెంలో ఓ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా ఎదుగుతున్న బీజేపీని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేతలు కవిత బెయిల్‌పై బీజేపీకి లింకు పెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చేస్తూ రుణమాఫీ, నిరుపేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, రాష్ట్ర నాయకుడు సాగర్‌రెడ్డి, దాసరి మల్లేశం, కేవీఎల్ఎన్ రెడ్డి, నాయకులు ఊడ్గుల రమేష్, ఎల్లయ్య, సిరాజ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సంపత్, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యను అశ్రద్ధ చేయొద్దు



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరు కంటి సమస్యను అశ్రద్ధ చేయొద్దని డాక్టర్ రాకేష్ అన్నారు. గురువారం మండలంలోని కొడవటూర్ గ్రామంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. ఆపరేషన్ అవసరమున్న వారికి ఉచితంగా చేయిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, వైద్యులు సాయి, తేజ, క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కొడకండ్ల: కేన్సర్ వ్యాధితో మృతి చెందిన రామవరం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ ఎడెల్లి స్వరూప కుటుంబానికి గురువారం డాక్టర్ హరికృష్ణ ఆర్థికసాయం అందజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, సహచర ఆశ వర్కర్లలంతా కలిసి అందించిన రూ. 26,200 మృతురాలి కుమారుడు అజయ్‌కు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించారు. సీహెచ్‌ఓ దయాకర్, విజయవర్షిణి, స్నేహలత, రఘుపతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

క్రీడలను పాఠ్యాంశంగా చేర్చాలి



స్టేషన్‌ఘన్‌పూర్: వేడుకల్లో మాజీ సర్పంచ్, ఉపాధ్యాయులు



జఫర్‌గఢ్: ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రాథమిక విద్య నుంచే క్రీడలను పాఠ్యాంశంగా చేర్చి పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను, శారీరక సామర్థ్యాలను వెలికితీయాలని ఛాగల్లు మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌లో పీడీ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సారంగపాణి మాట్లాడారు. అనంతరం ఛాగల్లు నుంచి వివిధ జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన శ్రావణ్, రాహుల్, తేజస్విలను సన్మానించారు. కార్యక్రమంలో విద్యాశాఖ మండల నోడల్ అధికారి కొమురయ్య, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, పరమేశ్వరి, రఘుపతి, కొల్లూరి ప్రకాశం, రంజిత్‌కుమార్, శ్రీనివాస్, విజయకుమారి, శాంతి, లలితకుమారి పాల్గొన్నారు. అలాగే మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రమేశ్, పీడీ కొండ రవి, శ్రీనాథ్, శ్రీనికాంత్, రాధాకృష్ణ, యాదగిరి, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

జఫర్‌గఢ్: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల నోడల్ అధికారి ఎండీ పర్వేజ్ అన్నారు. మండలంలోని కూనూర్, జఫర్‌గఢ్ మోడల్ స్కూల్‌తో పాటు పలు పాఠశాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి కుమార్, రాజు, శ్రీనాథ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

దేవరుప్పుల: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో హాకీ క్రీడను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెడ్మాస్టర్, జాతీయ క్రీడాకారుడు పిట్టల సోమయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, ,సురంజన్ రెడ్డి, జక్కుల గంగరాజు, ఇనుముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పగూడెంలో హెల్త్‌క్యాంపు

సాక్షి ఎఫెక్ట్..

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో విషజ్వరాలు ప్రబలుతుండగా ప్రజలు ఆందోళన చెందుతున్న విషయమై ఈనెల 28న సాక్షి దినపత్రికలో 'మంచం పట్టిన గ్రామాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యులు స్పందించారు. గ్రామ గ్రామాన విషజ్వరాల తీవ్రత, ఇప్పగూడెంలో పారిశుద్ధ్యంపై వచ్చిన కథనంపై స్పందించిన ఇప్పగూడెం పీహెచ్‌సీ డాక్టర్ ఇంజమామ్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక హెల్త్‌క్యాంపును నిర్వహించారు. క్యాంపులో డాక్టర్ ఇంజమామ్ రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమై వారికి మందులు అందించడంతో పాటు పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెల్త్‌క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. క్యాంపులో 78 మందిని పరీక్షించామని, అందులో 12 మందికి అవసరమైన పరీక్షలు చేసినట్లు తెలిపారు. మూడు రోజులుగా జ్వరం ఉన్నవారికి రక్తపరీక్షలు చేయిస్తామని తెలిపారు. జ్వరాలపై అనవసరంగా ఆందోళన చెందవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వైద్యుల సూచన మేరకు తగిన మెడిసిన్ తీసుకోవాలని ఆయన సూచించారు. హెచ్‌ఈఓ భగవాన్‌రెడ్డి, ఏఎన్ఎం ఎల్.వనజ, ఆశ కార్యకర్తలు రమ, శోభ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



హెల్త్‌క్యాంపులో వైద్యులు, వైద్య సిబ్బంది

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

కొడకండ్ల: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టి విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జాయింట్ కన్వీనర్ కోటేశ్వర్ కోరారు. గురువారం ఏడునూతుల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ నమోదు సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయించాలని, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సోమన్న, కన్నయ్య, వాసునాయక్, అంజనేయులు, రామకృష్ణ, మహేష్, పరమేశ్వర్, అజయ్, రమేష్, అర్జున్, సంపత్‌కుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

'స్థానికం'లో మహిళలకు అవకాశాలు కల్పించాలి

రఘునాథపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు అవకాశాలు కల్పించాలని మండలంలోని మహిళా కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు గురువారం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు పేర్నె ఉషారవి ఆధ్వర్యంలో హనుమకొండలో ఎంపీ, ఎమ్మెల్యేలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. మండలంలోని 36 గ్రామాలకు గాను 28 గ్రామాల్లో నూతన మహిళా గ్రామశాఖ అధ్యక్షులను నియమించామని ఎంపీ, ఎమ్మెల్యేకు విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోసం ఎంతో శ్రమించామని.. మండలంలోని మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ ప్రోత్సహించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి మహిళకు తాము అండగా ఉంటామని ఎంపీ కావ్య తెలిపినట్లుగా మహిళా నాయకులు పేర్కొన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మ విజయమేరి, నాయకులు శ్రీలత, అరుణ, లింగమ్మ, స్వప్న, పద్మ, యాకమ్మ, వివిధ గ్రామాల మహిళా గ్రామశాఖల అధ్యక్షులు ఉన్నారు.



ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరికి బొకేలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

రఘునాథపల్లి: రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షలు రైతు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతు భరోసాపై గురువారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ విమలకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు కాసాని పుల్లయ్య, కడారి ఆంజనేయులు, గొడుగు గోనయ్య, కాసాని వెంకన్న, కుమ్మరికుంట్ల దాసు, మద్దూరి రామనర్సయ్య, చిన్నం సిద్ధులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తి స్థాయిలో రుణాలు మాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన మెమోరాండంను ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యాకయ్య, రాములమ్మ, భాస్కర్, మహేందర్, పరమేష్, నర్సింహులు, సోమయ్య, రాజు, యాదగిరి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలి

లింగాలఘణపురం: ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వినయలతకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని చెప్పి నేడు అనేక విధాలుగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఎం మండల బాధ్యుడు దేవదానం అన్నారు. నాయకులు శంకరయ్య, ఉప్పలయ్య, వెంకటేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావుకు అందజేశారు. ఎడబోయిన రవీందర్‌రెడ్డి, రామగళ్ల అశోక్, తాడూరు వెంకటమ్మ, బలరాములు, కంత్రి ఐలయ్య, పొన్నాల రాజవ్వ, సులోచన, అమరాజు లక్ష్మి, ఇందిర, కడప లక్ష్మి, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

జనగామ రూరల్: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని సెయింట్ మేరీస్ పాఠశాలలో గురువారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ మాట్లాడుతూ అన్ని భాషల్లోకెల్ల తెలుగు భాష గొప్పదని అన్నారు. అనంతరం విద్యార్థులు చెప్పిన పద్యాలు, కవితలు, నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీకాంత్, మమత, రాజు, లలిత, విన్యా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ నర్సయ్య తెలుగు భాషా మాధుర్యాన్ని వివరించారు. అలాగే గతేడాది అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అధ్యాపకులు భవాని, నవీనారాణి, తదితరులు పాల్గొన్నారు.



తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు

ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకోవాలి

జనగామ రూరల్: ప్రశాంత వాతావరణంలో, సోదర బావంతో పండుగలు, గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ఏసీపీ కొండం పార్థసారథి అన్నారు. గురువారం వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం లేకుండా సామరస్యపూర్వకంగా పండుగలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెంచాలని సీఐ దామోదర్‌రెడ్డికి సూచించారు. ఎస్సైలు, పట్టణ శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

బచ్చన్నపేట: గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కంకల సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణపతి ఉత్సవ కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ మండపాలకు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని, రెండు బాక్సల టైప్ లౌడ్ స్పీకర్లను మాత్రమే వాడాలని, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు స్పీకర్లు వినియోగించొద్దని అన్నారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని, నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏసీపీ పార్థసారథి

నర్మెటలో..

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని సీఐ సాయి రమణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎస్సై నగేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

జనగామ రూరల్: మండలంలోని ఓబుల్‌కేశవాపూర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిరణ్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణ తంతు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

నేడు పెంబర్తిలో సీతారామచంద్ర స్వామికి లక్ష పుష్పార్చన

పెంబర్తిలో కొలువైన సీతారామచంద్ర స్వామి దేవాలయంలో స్వామివారికి శ్రావణ మాస చివరి శుక్రవారం(నేడు) సందర్భంగా లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పురోహితుడు శానగల నాగరాజు శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి

చిల్పూరు: గ్రామాల్లో పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేయడంలో మండల సమాఖ్యలు కృషిచేయాలని ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం భారతి పరస్పర సహకార పరిమిత, మార్కెటింగ్ మండల మహిళా సమాఖ్య 8వ వార్షికోత్సవ సమావేశాన్ని అధ్యక్షురాలు తాళ్లపల్లి స్వప్న అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ పలు సూచనలు చేశారు. అనంతరం ఇటీవల వంగాలపల్లికి చెందిన చిట్యాల నిరీష భర్త మృతి చెందగా ఇద్దరు పిల్లల పేరిట సమాఖ్య నుంచి రూ. 22 వేలు, ఐకేపీ నుంచి రూ. 40 వేలు.. మొత్తం రూ. 62 వేల చెక్కును అందజేశారు. సమావేశంలో సీసీలు గట్టు శ్రీను, రమాదేవి, కనుకచంద్రం, కార్యదర్శి మానస, కోశాధికారి రాధిక, ఉపాధ్యక్షురాలు శారధ, రమ, ఏదునూరి రమాదేవి పాల్గొన్నారు.



నిరీషకు చెక్కు అందజేస్తున్న సమాఖ్య ప్రతినిధులు

నాణ్యమైన భోజనం అందించాలి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు భైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయం వద్ద భైరవస్వామి నూతన విగ్రహాన్ని నేడు (శుక్రవారం) ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు, దాత భీం రెడ్డి కవిత, మల్లారెడ్డి దంపతులు ఈ విగ్రహాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయ సమీపంలోని గద్దెపై భైరవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నందున పూజలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు

చిల్పూరు: రుణమాఫీ కాని రైతులు గ్రామాలకు వచ్చిన అధికారుల వద్ద ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్నారని మండల వ్యవసాయ అధికారి షేక్ నజీరుద్దీన్ అన్నారు. మండలంలోని నష్కల్ గ్రామంలోని జీపీ వద్ద రుణమాఫీ కాని రైతుల నుంచి గురువారం దరఖాస్తులను తీసుకుని ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేశారు. ఏఈఓ వినయ్‌కుమార్, మాజీ సర్పంచ్ స్వప్నవెంకటేష్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

బచ్చన్నపేట: రుణ మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 2లక్షల రుణ మాఫీ చేసిందని, అర్హత ఉండి రుణ మాఫీ కాని రైతులు ఆందోళన చెందకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

బస్టాండ్‌ను పునర్నిర్మించాలి

జఫర్‌గఢ్: కూల్చివేసిన బస్టాండ్‌ను వెంటనే పునర్నిర్మించాలని గ్రామ యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ స్థలంలో గ్రామస్తుతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. రాజు, అరుణ్‌కుమార్, శేఖర్, సుదీర్, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'పీఎంశ్రీ సైన్స్ ల్యాబ్' గ్రామీణ విద్యార్థులకు వరం

పాలకుర్తి టౌన్: జెడ్పీ పాఠశాలలో మంజూరైన పీఎంశ్రీ పథకం సైన్స్ ల్యాబ్ విద్యార్థులకు వరం లాంటిదని మండల నోడల్ ఆఫీసర్ పోతుగంటి నర్సయ్య అన్నారు. పాఠశాలలో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్‌ను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. సైన్స్ ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా విధానం పెరుగుతుందన్నారు. హెచ్‌ఎం పాయం శోభారాణి, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల: మండలంలోని చెరువుముందు తండాలో అనారోగ్యంతో మృతి చెందిన పూలమ్మ, రవి కుటుంబాలను గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండలంలోని లింగంపల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్లు ఉషారాణి, విజయ, పద్మ అన్నారు. గురువారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డేను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తల్లులు, గర్భిణులు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూములను పరిరక్షించాలి

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లి గ్రామంలో సర్వేనంబర్ 341లో కబ్జాకు గురైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని గ్రామస్తులు గంగారపు సోమయ్య, గంగారపు సందీప్‌లు కోరారు. గురువారం వారు పాలకుర్తిలో మాట్లాడారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. తాము ఇచ్చిన సమాచారంతో విచారణ చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు విన్నవించినట్లు చెప్పారు. త్వరలో కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. కాగా, ఆరోపణ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, గ్రామస్తులు చెప్పిన ప్రకారం కబ్జా చేసిన వారి వివరాలు తెలుసుకుంటామని తెలిపారు. త్వరలో భూ సర్వే చేపడుతామని అన్నారు.



ఝాన్సీరెడ్డికి కాంగ్రెస్ శ్రేణుల ఘనస్వాగతం

దేవరుప్పుల/పాలకుర్తి: విదేశీ పర్యటన ముగించుకుని గురువారం స్వదేశానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక తిరుమలనాథ స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆంజనేయస్వామి గుడి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా ధర్మకర్త కలకోట రంగాచార్యులు చేతుల మీదుగా ముగ్గుపోసి నిర్మాణ పనులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు, భక్తుల సహకారంతో తిరుమలనాథ స్వామి దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే హనుమాన్ దేవాలయాన్ని నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు సిమెంట్ వెంకన్న, కొలిపాక సతీష్, సునీత, కుంభం నరేందర్, హేమలత, మాజీ ఎంపీటీసీలు డాక్టర్ జైహింద్ రాజ్, గోనెల ఉపేందర్, స్వామి, కుంభం మధు, సాంబరాజు, యాదమ్మ, వెంకన్న, లక్ష్మయ్య, చంద్రయ్య, రవి పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న రంగాచార్యులు

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

నర్మెట: పీఆర్టీయూ టీఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి దామెర ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ముందంజలో ఉండాలని అన్నారు. మండల అధ్యక్షుడిగా మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగాఆంజనేయచారి, మహిళా ఉపాధ్యక్షులుగా కల్పన, కార్యదర్శిగాగా సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మధుసూదన్



సంతోష్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో పురోహితుడికి తీవ్ర గాయాలు

రఘునాథపల్లి: ద్విచక్రవాహనంపై వెళ్తున్న పురోహితుడిని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలోని నిడిగొండ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన పురోహితుడు ఎల్లంబట్ల రామచంద్రమూర్తి విధుల్లో భాగంగా టీవీఎస్ ఎక్సెల్‌పై జనగామ వెళ్లి రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. నిడిగొండ బ్రిడ్జి వద్ద వెనకాల వచ్చిన నర్సంపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎక్సెల్‌ను ఢీ కొట్టింది. దీంతో రామచంద్రమూర్తి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని తీవ్ర గాయాలైన రామచంద్రమూర్తిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.